క్లుప్తంగా

చందనాలంకారంలో రంగనాథస్వామి



చేబ్రోలు: చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని రంగనాథస్వామి దేవస్థానంలో స్వామి శుక్రవారం చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాసం సందర్భంగా అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాల్ని ఘనంగా నిర్వహించారు. 20 కిలోల చందనంతో అలంకరించారు. గోదాదేవి అమ్మవారు ప్రత్యేక అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాస పూజలు, తిరుప్పావై, సహస్ర తులసీ దళార్చన, చతుర్వేద పారాయణం, సామూహిక విష్ణు సహస్ర అర్చన, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు చిన్నారులకు సామూహిక భోగి పండ్లు

పెదకాకాని: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానం ఆలయ ప్రాంగణంలో శనివారం చిన్నారులకు సామూహిక భోగి పండ్లు పోసే కార్యక్రమాన్ని నూతనంగా నిర్వహిస్తున్నట్లు ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3:45 గంటలలోపు తల్లిదండ్రులు చిన్నారుల్ని వెంట తీసుకొని ఆలయ ప్రాంగణానికి రావాలని ఆయన సూచించారు. పూజల అనంతరం స్వామి ప్రసాదాల వితరణ ఉంటుందని తెలిపారు. గ్రామోత్సవంలో భాగంగా శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తుల్ని ప్రత్యేకంగా అలంకరించిన మిద్దె రథంపై ఊరేగించనున్నట్లు వివరించారు.


నేడు ముగ్గుల పోటీలు

కాకుమాను: సంక్రాంతి పండుగ సందర్భంగా కాకుమానులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ నల్లమోతు శివరామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు గ్రామ ప్రధాన కూడలిలో నిర్వహించే పోటీలలో ఆసక్తి గల మహిళలందరూ పాల్గొనాలని ఆయన కోరారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ట్రాక్టర్ రివర్స్ పోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్‌ల దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

పొన్నూరు: బైక్‌ల దొంగతనం కేసులో నిందితుడిని పొన్నూరు పోలీసులు శుక్రవారం బ్రాహ్మణకోడూరు అడ్డ రోడ్డు వద్ద అరెస్టు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌ఐ వివరాలు తెలిపారు. మండలంలోని జూపూడికి చెందిన బొద్దు భారతరత్న అలియాస్ నికిల్ చెడు వ్యసనాలకు అలవాటు పడి బైక్‌లతో పాటు హుండీల దొంగతనాలకు పాల్పడుతున్నాడు. 2022 డిసెంబర్ 15న పచ్చలతాడిపర్రు రామాలయంలో హుండీ దొంగతనంపై వెంపరాల గోపీకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో అనుమానితుడుగా ఉన్న బొద్దు భారతరత్నను అదుపులోకి తీసుకుని పోలీసులు మధ్యవర్తుల సమక్షంలో విచారించారు. అతని వద్ద నుంచి రూ.3వేలతో పాటు నాలుగు బైక్‌లను సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిస్సింగ్ కేసు హత్యగా మార్పు



నవీన్ (ఫైల్)

పొన్నూరు: మిస్సింగ్ కేసును హత్య కేసుగా శుక్రవారం పట్టణ పోలీసులు మార్పు చేశారు. వివరాలు.. పట్టణంలోని 8వ వార్డుకు చెందిన బడుగు నవీన్(34) 2022 డిసెంబర్ 27వ తేదీ నుంచి కనబడటం లేదని అతడి తల్లి వెంకటేశ్వరమ్మ 31న పట్టణ పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్‌ఐ షేక్ హసీమ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నవీన్ అత్త ఎడాలి రత్తమ్మ అతడ్ని హత్య చేశామని పట్టణ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయింది. ఆమెను విచారించగా.. నవీన్ భార్య శివ పార్వతి, శ్రీను అనే వ్యక్తి కలసి డిసెంబర్ 27న హత్య చేసి గుడిపూడి-యాజలి మధ్యలో తుంగభద్ర కాలువలో పడవేశారని చెప్పింది. దీంతో మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చి పట్టణ సీఐ బాబి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలు వేస్తే కఠిన చర్యలు : సీఐ

పెదకాకాని: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో కోడి పందేలు, పేకాట, గుండాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పెదకాకాని సీఐ బండారు సురేష్ బాబు తెలిపారు. ఆర్కెస్ట్రా డాన్సులు, రాత్రిపూట రోడ్లపై తిరగడం, అర్ధరాత్రి పూట బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం మంచిది కాదని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడి పందేలు వేసే వారిపై పోలీసు నిఘా ఉంటుందని తెలియజేశారు.

సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం ఉన్నతి

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: ప్రతి కుటుంబం ఆర్థిక పరిపుష్టి సాధించాలనే సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. మండలంలోని ఆలూరులో శుక్రవారం ఉదయం, సాయంత్రం కొండముదిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు గ్రామస్తులు మంగళహారతులు పట్టి స్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ ఆయన వెళ్లి, ప్రభుత్వం మూడేళ్లగా అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. గత పాలకులు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. గ్రామాల అభివృద్ధిని మరిచారని, అరకొర సీసీ రోడ్లు వేసి ప్రజల్ని మభ్యపెట్టారని తెలిపారు. గత మూడేళ్లలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించామని చెప్పారు. నేడు ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచామన్నారు. రైతు భరోసా పథకం తీసుకువచ్చి రైతులు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లకుండా చేశారన్నారు. ప్రతి సంవత్సరం రూ.13,500 అందిస్తున్నామని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రకృతి విపత్తు వల్ల రైతు నష్టపోకుండా ఈ- క్రాప్ నమోదు చేసి ప్రభుత్వమే ఆదుకుంటోందని వివరించారు. గిట్టుబాటు ధర లేని సమయంలో ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తోందని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. అమ్మ ఒడి, జగనన్న విద్య దీవెన, వసతి దీవెన, నాడు-నేడు పథకంలో పాఠశాలల్ని అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. పేదలు వైద్యం కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదనే ఆలోచనతోనే సీఎం ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.5 లక్షల వరకు పెంచారని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో నేతలు దాసరి నారాయణ రావు, ఆకులు వెంకటేశ్వరరావు, రుద్రపాటి ఆదిశేషు, రుద్రపాటి నాగేశ్వరరావు, కంచర్ల కరుణబాబు, బొద్దులూరి రంగారావు, శివరామ్ ప్రసాద్, శివరామ్ కృష్ణ, దాసరి శ్రీనివాసరావు, దాసరి విశాలి, బోయిన శేషగిరి, శివనాగమల్లేశ్వరావు, కంచర్ల సుధాకర్, కె.నవకుమార్, పి.ప్రవీణ్ పాల్గొన్నారు.

పండుగ అందరి ఇళ్లలో సంతోషాన్ని నింపాలి

పొన్నూరు: సంక్రాంతి పండుగను అంతా సంతోషంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. మండలంలోని ఆలూరు అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ ప్రేమలత ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాల్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చిన్నారులకు భోగిపండ్లు పోశారు. సంక్రాంతి పండుగ అందరి ఇండ్లలో సంతోషాన్ని నిపాలని కోరారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త అరుణ కుమారి, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగనన్నకు రెండు కళ్లు



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుచరిత

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి రెండు కళ్ల వంటివని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు జగనన్న అనేక సంక్షేమ పథకాల్ని ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రం కూడా అభివృద్ధి దిశగా ముందుకు అడుగులు వేస్తోందని చెప్పారు. అనంతరం బెజ్జం క్రాంతి కుమార్‌కు రూ. 4 లక్షలు, గ్రంధి గాయత్రికి రూ. 70 వేలు, కావూరి మోషేకు రూ. 26 వేలు, దొప్పలపూడి సత్యనారాయణకు రూ. 22 వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రబీలోనూ ఈ- పంట నమోదు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

పొన్నూరు: రబీలోనూ రైతులు ఈ- పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం ఏడీఏ తిరుమలాదేవి అధ్యక్షతన మండల వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పని చేస్తున్నారని తెలిపారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ లంకపోతు పిచ్చిరెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించిన ప్రతి రైతుకు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 21 రోజుల్లో నగదును బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. గోనె సంచులు, కూలీ, రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. కార్యక్రమంలో ఏట వెంకట రామయ్య, రైతులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట



పొన్నూరు: వివాహం చేసుకుని పోలీసుల్ని ఆశ్రయించిందో ప్రేమజంట. మండలంలోని నండూరుకు చెందిన సందెపూడి చంటి, అదే గ్రామానికి చెందిన భట్టు సుష్మా కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. విషయం రెండు కుటుంబాల్లో తెలియడంతో ఈ నెల 9న బాపట్లలో వివాహం చేసుకున్నారు. 11న జిల్లా ఎస్పీని కలిశారు. తిరిగి శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి కుటుంబ సభ్యులతో ఇబ్బందులు ఉన్నాయని రూరల్ ఎస్‌ఐ భార్గవ్‌కి తెలిపారు. దీంతో ఆయన రెండు కుటుంబాల వారిని పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. అయితే, ప్రేమజంటను తీసుకు వెళ్లడానికి వారు అంగీకరించలేదు. చంటి మేనమామ బాపట్లలో ఉన్నాడని, అక్కడకు వెళ్లతామని చెప్పడంతో ఎస్‌ఐ భార్గవ్ కౌన్సెలింగ్ అనంతరం పంపించారు.

ఒక్క రంగవల్లిలో ఎన్ని ప్రభుత్వ పథకాలో..

- నడింపాలెం ఏఎన్‌ఎం ప్రతిభ



ప్రభుత్వ పథకాలతో అందంగా తీర్చిదిద్దిన రంగవల్లి

నడింపాలెం (ప్రత్తిపాడు): ఒక్క రంగవల్లిలో అనేక పథకాలను మిళితం చేసి.. వివిధ ప్రభుత్వ పథకాల లోగోలతో రూపం పోసింది ఓ ఏఎన్‌ఎం. ప్రత్తిపాడు మండలం నడింపాలెం సచివాలయం వద్ద శుక్రవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామ ఏఎన్‌ఎం అంథోని కళాత్మకంగా ఆలోచించి పుష్పం ఆకారంలో వినూత్నంగా ముగ్గు వేశారు. అందులో టెలీ మెడిసిన్, స్వచ్ఛభారత్ (ఫ్రైడే డ్రై డే), కోవిడ్-19 (వ్యాక్సినేషన్), మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్, ఆయుష్మాన్ భారత్ (యోగ), హెల్త్ వెల్నెస్ సెంటర్లు, సబ్ సెంటర్, సచివాయం పేర్లు, లోగోలతో రంగవల్లిని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ రంగవల్లికే ప్రథమ స్థానం సైతం దక్కింది.

ముందస్తు సంక్రాంతి సంబరాల సందడి



కేర్ డెంటల్ కళాశాలలో సంక్రాంతి పొంగలి తయారు చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



విజ్ఞాన్ నిరులాలో పొంగలిని తయారు చేస్తున్న ప్రిన్సిపల్ రాధిక తదితరులు



చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు గుల్జార్ బేగం

గుంటూరు రూరల్: మన సంస్కృతీ, సంప్రదాయాల్ని పండుగలు భావితరాలకు తెలియజేస్తాయని కేర్ డెంటల్ కళాశాల చైర్మన్ సయ్యద్ రసూల్ తెలిపారు. మండలంలోని పొత్తూరులో గల కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్రాంతి పొంగళ్లను తయారు చేశారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు, క్రీడలు, పోటీల్ని నిర్వహించి విజేతలకు బహుమతుల్ని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం జీవతార, మొహిద్దీన్, సమీనా, ధనలక్ష్మి పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరులాలో....

తెలుగువారి సంస్కృతీ, సంప్రదాయాల పండుగ సంక్రాంతి అని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాధిక తెలిపారు. పెదపలకలూరు గ్రామంలోని కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలుగు వారి పండుగల్లో సంక్రాంతి పెద్దదని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సంప్రదాయాల వస్త్రాల పోటీలు, భోగి మంటలు, రంగవల్లులు, బొమ్మల కొలువులు, గాలిపటాలు ఎగర వేయడం తదితర పోటీల్ని నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల స్టూడెంట్స్ యాక్టివిటీ కమిటీ ఇంచార్జ్ వేణుమాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

కాకుమాను అంగన్‌వాడీ(ఓసీ)కేంద్రంలో...

కాకుమాను: స్థానిక అంగన్‌వాడీ (ఓసీ) కేంద్రంలో చిన్నారులకు భోగిపళ్లతో ఆశీర్వాద కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పండుగను సంతోషంతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ అందరి ఇళ్లల్లో సుఖసంతోషాలను నింపాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసుపులేటి శివకుమారి, కాకుమాను, పాండ్రపాడు సెక్టార్ సూపర్ వైజర్లు పోసమ్మ కుమారి, పి.వెంకాయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుట్టలమ్మ తల్లి సంక్రాంతి సంబరాలు ప్రారంభం

- ముగ్గుల పోటీల్లో భారీగా పాల్గొన్న మహిళలు
- నేడు అమ్మవారి భారీ ఊరేగింపు



విద్యుత్ కాంతులతో పుట్టలమ్మ ఆలయం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైస్ ఎంపీపీ పద్మావతి

గుంటూరు రూరల్: నల్లపాడు, చల్లావారిపాలెం గ్రామాల ప్రజలు ప్రతిష్టాత్మంగా నిర్వహించే శ్రీ పుట్టలమ్మ తల్లి, శ్రీ ఘంటాలమ్మ తల్లి సంక్రాంతి సంబరాల్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం మహిళలకు ముగ్గుల పోటీల్ని నిర్వహించారు. వందలాది మంది పాల్గొన్న ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ. 10వేల పట్టు చీరను గుంటూరుకు చెందిన డి. ఉమాదేవి, రెండవ బహుమతి రూ.7వేల పట్టుచీరను గుంటూరుకు చెందిన బి. మాధవి, మూడవ బహుమతి రూ. 5 వేల పట్టుచీరను మాదల గ్రామానికి చెందిన పి.సుజాత గెలుచుకున్నారు. నాలుగో బహుమతి రూ. 3 వేల పట్టుచీరను నరసరావుపేటకు చెందిన సీహెచ్. విజయలక్ష్మి గెలుచుకోగా, దాన్ని గుంటూరుకు చెందిన విరించి ఫ్యాషన్స్ షోరూం యాజమాన్యం అందజేస్తుందని ఆలయ కమిటీ తెలిపింది. విజేతలకు బహుమతులను ఈనెల 15వ తేదీన సాయంత్రం ఆలయం వద్ద జరిగే కార్యక్రమంలో అందజేస్తామని పేర్కొంది. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ జనతా సూపర్ మార్కెట్ చక్కా శివకుమార్, గ్రంధి శంకరరావు రెండు చీరల చొప్పున బహుమతిగా అందజేశారు. విజేతలకు ఆలయ కమిటీ మొదటి బహుమతిగా నాలుగు బర్నర్ల గ్యాస్ స్టవ్, ద్వితీయ బహుమతిగా ట్రేజార్ మిక్సర్, తృతీయ బహుమతిగా ఓవెన్, నాలుగవ బహుమతిగా వెట్ గ్రైండర్‌ను అందజేశారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు హోమాలతోపాటు సాయంత్రం 6 గంటలకు భారీ మేళతాళాలతో, దేవతామూర్తుల వేషధారణలతో తమిళనాడు, తెలంగాణ, ఆంధ్ర, కేరళ మహిళా డప్పుల బృందాలతో భారీ ఊరేగింపు జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డి తెలిపారు. విజేతలకు మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఇంటూరి పద్మావతి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, సిద్దె రామయ్య, ఇమడాబత్తిని నాగేశ్వరరావు, ముక్కమళ్ల సాంబిరెడ్డి, చల్లా పార్థురెడ్డి, తియ్యగూర శ్రీనివాసరెడ్డి, గ్రామ ప్రజలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుచరిత సంక్రాంతి శుభాకాంక్షలు



గుంటూరు రూరల్: తెలుగు వారి సంస్కృతీ, సంప్రదాయాల పండుగ సంక్రాంతి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత తెలిపారు. నియోజకవర్గం ప్రజలకు ఆమె భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. పంటలు బాగా పండి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

సంప్రదాయాల కొనసాగింపు అభినందనీయం

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.అనిత



విజేతలను సన్మానిస్తున్న పోలూరి, పక్కన న్యాయమూర్తులు

గుంటూరు లీగల్: సంక్రాంతి పండగ సందర్భంగా సంప్రదాయాల్ని కొనసాగిస్తూ ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.అనిత అన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా న్యాయవాదులకు శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.అనిత, రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఎం.వెంకటేశమ్మ, నాలుగో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఎ.సునీత, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గోరంట్ల స్వాతి, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జోష్నశ్రీ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. న్యాయమూర్తులు అన్ని ముగ్గులను పరిశీలించి విజేతల్ని ప్రకటించారు. మొత్తం ఎనిమిది మంది పాల్గొన్నారు. పాటిబండ్ల ఇంద్రజకు మొదటి బహుమతి, నాగకమల, ప్రత్యూషకు రెండో బహుమతుల్ని అందజేశారు. మిగిలిన వారికి కూడా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. జీబీఏ అధ్యక్షుడు పాలడుగు వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ వేముల జయపాల్, లేడీ రిప్రజెంటేటివ్ ఎం.నాగలక్ష్మి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సిద్ధ సత్యనారాయణ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ తాడిశెట్టి వెంకట ఆనందరావు పాల్గొన్నారు.

విజేతలకు ప్రత్యేక సన్మానం

ముగ్గుల పోటీల్లో విజేతలు, పాల్గొన్న అందరికీ గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. జీబీఏ ఎన్నికల్లో ప్రెసిడెంట్ అభ్యర్థి కాసు వెంకటరెడ్డి, జీపీ పోకల వెంకటేశ్వరరావు, న్యాయవాదులు బుడపాటి కిరణ్, సీడీ భగవాన్, ఏపీపీ వజ్రాల రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో వేజండ్ల విద్యార్థుల ప్రతిభ

రాష్ట్రస్థాయి పోటీలకు ముగ్గురు ఎంపిక



విద్యార్థులతో హెచ్‌ఎం విజయశ్రీ, పీఈటీ వెంకటేశ్వరావు

వేజండ్ల(చేబ్రోలు): జిల్లా స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి వేజండ్ల జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. నంబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 11, 12వ తేదీల్లో అండర్-14, అండర్ -17 స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. ఇందులో అండర్-14 బాలికల విభాగంలో మట్టుపల్లి సుమశ్రీ మొటి స్థానం సాధించి జిల్లా జట్టుకు ఎంపికైంది. అండర్-17 బాలికల విభాగం 400 మీటర్ల పరుగు పందెంలో కూరపాటి స్ఫూర్తి ప్రథమ స్థానం, 3000 మీటర్ల పరుగు పందెంలో జోగిపర్తి నాగూర్‌బీ మొదటి స్థానం, 1500 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించింది. ఈ ముగ్గురు ఈ నెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి అండర్-14, అండర్-17 అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారు. శిక్షణ ఇచ్చిన పీఈటీ వెంకటేశ్వరరావును, విద్యార్థులను హెచ్‌ఎం టి. విజయశ్రీ , ఉపాధ్యాయులు అభినందించారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

అధికారుల సమావేశంలో కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారుల్ని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, స్వచ్ఛ సర్వేక్షణ్, అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసుకునేలా సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఉగాది నాటికి ప్రతి లేఅవుట్‌లో గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని చెప్పారు. లే అవుట్ల వారీగా ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఎస్‌ఈ భాస్కర్, హౌసింగ్ పీడీ సాయినాథ్‌కుమార్, ఈఈలు సుందరరామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, హౌసింగ్, నగరపాలక సంస్థ డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ అభినందనీయం

గుంటూరు ఎడ్యుకేషన్ : గణిత శాస్త్ర అధ్యాపకుడు పులుగు దీపక్ ఆధ్వర్యంలో పండరీపురంలో నిర్వహిస్తున్న ఉచిత జేఈఈ, నీట్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం విశ్రాంత డీఆర్‌డీఓ శాస్త్రవేత్త ప్రొఫెసర్ అందే మురళీ వరప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పుల్ని విద్యార్థులకు వివరించారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు జాతీయ స్థాయిలో జరిగే జేఈఈ, నీట్ పరీక్షలకు ఉచిత శిక్షణ కల్పించడం అభినందనీయమన్నారు. శిక్షకుడు దీపక్ మాట్లాడుతూ విద్యార్థులు తమ చదువును సమాజానికి ఉపయోగపడే విధంగా మలచుకోవాలని, జీవితంలో లక్ష్యాన్ని చేరుకున్నాక తిరిగి సమాజాభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందించాలని సూచించారు.

ప్రభుత్వ మహిళా కళాశాలకు ఓవరాల్ చాంపియన్‌షిప్



ఏఎన్‌యూలో ఓవరాల్ చాంపియన్ షిప్ షీల్డ్ కైవసం చేసుకున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గురువారం నిర్వహించిన అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన ప్రభుత్వ మహిళా కళాశాల క్రీడాకారిణుల్ని ప్రిన్సిపాల్ వి.ఆర్.జ్యోత్స్నకుమారి అభినందించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో కళాశాల విద్యార్థినులు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్లు ఆమె శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినుల్ని కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందించింది.